సార్వా సాగు పనులు ముమ్మరం



అలుగులగూడెంలో దుక్కి దున్నుతున్న రైతు



కొవ్వలిలో నారు వేసిన దృశ్యం

దెందులూరు: నియోజకవర్గంలో గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. దెందులూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో 64 ఎకరాల్లో సార్వా సాగు పనుల్లో భాగంగా ట్రాక్టర్లతో దుక్కిదున్నడం, నారుపోయడం, నీరు కట్టడం వంటి పనులు సాగుతున్నాయి. జూన్ మొదటివారం కావడం, రుతుపవనాలు రాష్ట్రానికి ప్రవేశించడంతో పాటు బోర్లు కింద సాగు చేసే రైతుల సైతం సాగు పనులపై ఆశాజనకంగా ఉన్నారు. దెందులూరు నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. గోదావరి కాలువ, కృష్ణా కాలువ బోర్ల కింద నీటితో నియోజకవర్గంలో రైతులు సాగు చేస్తున్నారు.

రైతులకు సూచనలు

విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లు తీసుకోవాలి. ట్యాంకులు భద్రపరచాలి. 85 శాతం మొలకెత్తిన తరువాత నాటాలి. మందులతో కలిపి విత్తన శుద్ధి చేయాలి.వ్యవసాయశాఖ సూచనలు పాటించాలి.

సాగుకు అనుకూలమైన విత్తనాలు

ఎంటీయూ 1328, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, స్వర్ణ విత్తనాలు ఈ ప్రాంతాల్లో సాగుకు, దిగుబడి ఈ వాతావరణం అనుకూలం. ప్రతి దశలోనూ రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించాలి.

నియోజకవర్గం వారీగా వివరాలు

మండలం	సాగు (ఎకరాలు)
దెందులూరు	21
పెదపాడు	18
పెదవేగి	15
ఏలూరు రూరల్	10

సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకోవాలి



రైతులు సాగుపనుల్లో అధిక దిగుబడే లక్ష్యంగా ఉండకూడదు. భూసారం, నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు, రైతుభరోసా కేంద్రాల సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవాలి. ప్రతిదశలో వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు, సలహాలు తీసుకోవాలి.

– కె. సుబ్బారావు, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవసాయశాఖ

భీమడోలులో భారీ వర్షం



జాతీయ రహదారి కొండ్రెడ్డినగర్ వద్ద కురుస్తున్న భారీ వర్షం

భీమడోలు: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కపోతతో విలవిల్లాడిన ప్రజలకు ఈ వర్షం ఉపశమనాన్ని కలిగించింది. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, అంబర్‌పేట, కొండ్రెడ్డినగర్, సూరప్పగూడెం, కురెళ్లగూడెం తదితర గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. వ్యవసాయ పనులు మరింత ఊపందుకునేందుకు ఈ భారీ వర్షం ఉపకరిస్తుందని రైతులు అన్నారు. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీనితో పలు రహదారులన్నీ వర్షపు నీటిలో మునిగాయి. రాత్రి వేళ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనితో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారులపై ఉన్న విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. భారీ వాహనాలు సైతం రహదారుల పక్కనే వాటిని నిలిపివేశారు.

క్లుప్తంగా

చిన్నారికి సాయం అందజేత



మానవత ప్రతినిధులు బాలిక వైద్య ఖర్చుల నిమిత్తం సాయం అందజేస్తున్న దృశ్యం

ఉంగుటూరు : మెదడు సంబంధ వ్యాధితో బాధపడుతున్న సంవత్సరన్నర వయస్సు సత్యశ్రీ అనే పాపకు మానవత ప్రతినిధులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.11,000 నగదును శుక్రవారం అందజేశారు. నారాయణపురంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో నగదును పాప తండ్రి కంకిపాటి మోష్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధులు ఎస్.జానకి రామరాజు, పుప్పాల గోపి, గుణ్ణం బుల్లిఅబ్బాయి, అడపా శ్రీను, గంజి రవి, శీతాల సత్యనారాయణ, సూర్యనారాయణరాజు, నేదూరి గంగాధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధర్మరాజును కలిసిన అధికారులు, నేతలు



ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈవో అబ్రహం

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ తరపు పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించిన పత్సమట్ల ధర్మరాజును తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, పలువురు అధికార్లు కలిసి అభినందనలు తెలిపారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం ఉంగుటూరు, భీమడోలు మండలాల ఉపాధ్యాయులతో వెళ్లి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కలిసి అభినందనలు తెలిపారు. ఉంగుటూరు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పాతూరి విజయకుమార్, రెడ్డి చందు, బండారు మదులు ధర్మరాజును కలిసి అభినందనలు తెలిపారు. గ్రామంలోని పార్టీ కార్యకర్తలు ధర్మరాజును కలిసి అభినందనలు తెలిపారు.

గోదావరి కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకం



నారాయణపురం వంతెన వద్ద అడ్డుపడ్డ తూడు

ఉంగుటూరు : గోదావరి కాలువలో వంతెనలు తూములు వద్ద చెత్త చెదారం తూడులు అడ్డుపడ్డాయి. నీటి ప్రవాహానికి తూడు అడ్డుపడుతోంది.విజ్జేశ్వరం నుంచి ప్రవహిస్తూ వస్తున్న ఈ కాలువ ద్వారా స్థానిక ఆయకట్టుకు సాగునీరు, సమీప గ్రామాలకు తాగునీరు అందజేస్తుంది. నారాయణపురం, ఉంగుటూరు, నాచుగుంట, బాదంపూడి, కై కరం వంతెనల వద్ద వివిధ తూడు విపరీతంగా పెరిగి అడ్డుపడటంతో కాలువలో నీటి ప్రవాహ వేగం తగ్గింది. ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



కాశిపాడులో పౌష్టికాహార ప్రయోజనాలు వివరిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: సమతుల పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చునని వైద్య సిబ్బంది అన్నారు. శుక్రవారం గణపవరం మండలం కాశిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో విలేజ్ న్యూట్రిషన్ దినోత్సవం సందర్భంగా పౌష్టికాహారంపై పిల్లలు, తల్లులు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాల ద్వారా అందే పోషకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, ఏఎన్ఎం శివకుమారి, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళలు తమకాళ్లపై తాము నిలబడి సాధికారత సాధించడానికి లయన్స్‌క్లబ్ కృషి చేస్తుందని లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. ఏలూరు విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వివిధసేవా కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కంద్రికగూడెంలోని సెయింట్ అంథోని పాఠశాలలో మొక్కలు నాటడంతో పాటు పలువురికి మొక్కలు ఉచితంగా పంపిణీ చేశారు. గన్‌బజారులోని 25 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. హనుమాన్ నగర్‌లో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మొక్కలను తోట ఎడ్వర్డ్ స్పాన్సర్ చేయగా, ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ పావని, గ్లోబల్ సర్వీస్ కో ఆర్డినేటర్ సీహెచ్. అవినాష్ రాజు, లయన్స్ జోన్ చైర్‌పర్సన్ ఐ.నిర్మల, రీజియన్ చైర్మన్ వి.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్ పాస్క్వలికి ఘన నివాళి



ఫాదర్ సిల్వియో పాస్క్వలీ సమాధికి గజమాల వేస్తున్న బిషప్‌లు జయరావు, దామన్‌కుమార్

పెదవేగి : ఇటలీ నుంచి భారతదేశానికి వచ్చి సామాన్య జీవనం గడిపి పేదలకు మరువలేని సేవలందించిన ఫాదర్ సిల్వియో పాస్క్వలి పునీతులని ఏలూరు పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ పొలిమేర జయరావు పేర్కొన్నారు. గురువారం రాత్రి పెదవేగి మండలం పినకడిమి పవిత్ర భూమిలో సీఎస్‌పి సంస్థ వ్యవస్థాపకుడు ఫాదర్ సిల్వియో పాస్క్వలి 100వ వర్ధంతిని ఆ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీఎస్‌పి సుపీరియర్ జనరల్ సిస్టర్ జపమాల ఆధ్వర్యంలో స్థానిక హోలీల్యాండ్ సుపీరియర్ సిస్టర్ ఇన్నాసమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఫాదర్లు, సిస్టర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన మోస్ట్ రెవరెండ్ ఏలూరు బిషప్ పొలిమేర జయరావు, నల్గొండ బిషప్ కర్నం దామన్‌కుమార్ ప్రత్యేక దివ్యబలి పూజ అర్పించారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ ఫాదర్ సిల్వియో పాస్క్వలి ఇటలీ నుంచి మన దేశానికి క్రీస్తు సువార్తను ప్రకటించేందుకు వచ్చి, ఇక్కడ పేదలతో కలిసి జీవించి వారికి అన్ని విధాలుగా చేయూతనిస్తూ, ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు, సిస్టర్లు, సిబ్బంది, పలువురు క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలి



ఇంటింటికీ వెళ్లి చిన్నారులను బడిలో చేర్చుకున్న హెచ్‌ఎం పి.పాండురంగారావు, ఉపాధ్యాయులు

భీమడోలు: అన్ని సదుపాయాలు కలిగిన ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చేర్పించాలని కోరుతూ శుక్రవారం గుండుగొలను-1 పాఠశాలల సిబ్బంది విద్యార్థుల నమోదు డ్రైవ్ నిర్వహించారు. హెచ్‌ఎం పాశం పాండురంగారావు ఆధ్వర్యంలో టీచర్లు తమ పాఠశాలల పరిధిలో ఐదేళ్లు నిండిన చిన్నారుల ఇంటింటికీ వెళ్లి వారిని బడిలోని చేర్చుకున్నారు. ప్రభుత్వ బడుల్లో చేరడం ద్వారా విద్యార్థులకు అందే వసతులను వారి తల్లిదండ్రులకు వివరించారు. నాణ్యమైన విద్యాబోధనతో పాటు చక్కని మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలు, డిజిటల్ తరగతి గదుల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో తరగతులు కొనసాగుతాయని, తద్వారా విద్యార్థులు సమగ్రాభివృద్ధిని సాధిస్తారని తల్లిదండ్రులు వివరించి వారిని ఒప్పించి వారి వయస్సుల ఆధారంగా వారి తరగతుల్లో 15 మందిని చేర్పించారు. ప్రభుత్వ బడుల్లో చేరేందుకు తల్లిదండ్రులు ఆసక్తిని చూపుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాల పెంపునకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ సోమసుందర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయులు నూతన బోధనా పద్ధతులు పాటించడం ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంచడానికి కృషి చేయాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.సోమశేఖర్ అన్నారు. పునాది అభ్యసనంతో ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో స్థానిక ఆర్ఆర్ పేటలోని ఈదర సుబ్బమ్మ దేవి మున్సిపల్ హైస్కూల్‌లో గురు, శుక్రవారాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కార్యక్రమానికి విచ్చేసిన సోమశేఖర్ మాట్లాడుతూ నూతన బోధనా పద్ధతులు, మూల్యాంకనం ద్వారా 1, 2 తరగతుల విద్యార్థుల్లో సంపూర్ణ అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమ కోఆర్డినేటర్, అకడమిక్ మానిటరింగ్ అధికారి రెడ్డి రామారావు మాట్లాడుతూ ఈ శిక్షణలో ప్రధానంగా 1,2 తరగతి విద్యార్థులకు అక్షరాలు, పదాలు గుర్తించడం, వాక్య నిర్మాణం, అంకెలు గుర్తించడం చతుర్విధ గణిత ప్రక్రియలు గురించి పూర్తి అవగాహన రావడానికి సాంప్రదాయ పద్ధతులతో పాటు చేయడం ద్వారా నేర్చుకోవడం (లెర్నింగ్ బై డూయింగ్) ప్లే వే పద్ధతుల ద్వారా నేర్పడం కోసం శిక్షణ అందించామని చెప్పారు. ఈ శిక్షణకు ప్రతి మండలం నుంచి ముగ్గురు బెస్ట్ టీచర్లను డీఆర్పీలుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చామని, వీరు మండలాలకు వెళ్లి ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో కీ రిసోర్స్ పర్సన్లుగా పి.వెంకటరమణ, కె.హరికృష్ణ, బి.రాజబాబు, ఎస్ రాము వ్యవహరించారు.

విజ్ఞాన కేంద్రాలు వేసవి శిబిరాలు



గుండుగొలను లైబ్రరీలో చిన్నారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించిన దృశ్యం

గణపవరం: వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకునేలా వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు అన్నారు. శుక్రవారం గణపవరం శాఖా గ్రంథాలయంలో నెల రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. శిబిరంలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ తరపున ప్రముఖ వ్యాపారి కామిరెడ్డి నాగేశ్వరరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గుమ్మడి సుబ్బారావు, గ్రంథ పాలకురాలు సుభాషిణి పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

పెదవేగి : స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిక్షణశిబిరం (సమ్మర్‌క్యాంప్ -2024) ముగిసింది. ముగింపు సభకు ముఖ్య అతిథిగా పెదవేగి సర్పంచ్ తాతా శ్రీరామూర్తి అధ్యక్షత వహించారు. ఈ సభను స్థానిక గ్రంధపాలకుడు తోట అరుణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరామూర్తి మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపునకు క్రమం తప్పకుండా హాజరైన చిన్నారులను, వారి తల్లితండ్రులను అభినందించారు. విశ్రాంత పశువైద్యాధికారి కె.రామ్మోహనరావు ముందుగా చిన్నారులకు అభినందనలు తెలిపారు. చిన్నారులకు శిక్షణ అందించిన రిసోర్స్ పర్సన్స్‌లను అభినందించారు. ఈ సమ్మర్ క్యాంపులో క్రమం తప్పకుండా హాజరైన విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు, బహుమతులు సర్పంచ్ చేతుల మీదుగా అందజేశారు.

ఆధునిక దేవాలయాలు.. గ్రంథాలయాలు

భీమడోలు: గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలని పలువురు వక్తలు అన్నారు. పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో 21 రోజులు పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శిక్షణ తరగతులు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు శిక్షణ తరగతులకు హాజరై శిక్షణాంశాలను చక్కని నేర్చుకుని పోటీల్లో చక్కని ప్రతిభను చూపిన బాలబాలికలు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. పూళ్లలో గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో, గుండుగొలనులో గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరైన ఉపాధ్యాయులు, పెద్దలు పాల్గొని వారికి గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల ఫణికుమార్, గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు ఈశ్వరమ్మ, వడ్లపట్ల ప్రభాకరరావు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.



పూళ్ల గ్రంథాలయంలో బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్న చిన్నారులు



గణపవరం గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాగేశ్వరరావు

గోగుంట సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, సభ్యుల రాజీనామా



భావరాజు సత్యనారాయణ

పెదపాడు: గోగుంట కో ఆపరేటివ్ సొసైటీ త్రీమెన్ చైర్మన్ భావరాజు సత్యనారాయణ, త్రిమెన్ కమిటీ సభ్యులు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. చైర్మన్‌తో పాటు త్రీమెన్ కమిటీ సభ్యులు ముంగర రమేష్, వల్లూరు శ్రీనివాసరావు (దత్తుడు) తమ వ్యక్తి కారణాల రీత్యా రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ రాజీనామా పత్రాలను జిల్లా కో ఆపరేటివ్ అధికారులకు రిజిష్టర్ పోస్టులో తమ రాజీనామా పత్రాన్ని సమర్పిస్తున్నట్లు చెప్పారు.

యువకుల రక్త దానం

ఏలూరు (టూటౌన్): రక్త దానం చేసి మరొకరికి ప్రాణదాతలు కావాలని జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సెంటర్‌లో శుక్రవారం 27 మంది యువకులు రక్తదానం చేశారు.

దోమలతో ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది తదితరులు

ఏలూరు (టూటౌన్): దోమలతో మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపిస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో వైద్య చికిత్స పొందాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. స్థానిక గవరవరం చెరువు గట్టు ప్రాంత ప్రజలకు మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గోవిందరావు మాట్లాడుతూ మనకు హాని చేసే దోమలైన మలేరియా కారక దోమ అనాఫిలస్, డెంగీ కారక దోమ ఎడిస్ ఇళ్లలో ఉండే నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. వారానికి ఒకసారి ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం ఆచరించాలని సూచించారు. జ్వరం, చలి,వణుకు, చెమట పట్టడం మొదలగు లక్షణాలు ఉంటే సమీప ఆరోగ్య కేంద్రాలను లేదా అర్బన్ హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను సందర్శించాలని అన్నారు. ఆయా కేంద్రాల్లో మలేరియా, డెంగీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ఆరోగ్య కార్యకర్త జి.నాగమణి, హెల్త్ అసిస్టెంట్స్ మేక శ్రీనివాసరావు, సీహెచ్ రమేష్, అయ్యప్ప, ఆశా కార్యకర్తలు కె.శాంతి, వసంత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డీఈఓ ఎస్ అబ్రహాంను పీఆర్‌టీయూ నాయకులు కోరారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో శుక్రవారం డీఈఓ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని, 14వ తేదీని కూడా కలిపి డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించాలి కోరారు. విద్యా కానుక కిట్లు, పాఠ్యపుస్తకాలు వంటివి పాఠశాల పాయింట్‌కే చేర్చాలని కోరారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వల ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సుబ్బారావు ఉన్నారు.

దేశంలో 38 లక్షల మంది క్యాన్సర్ బాధితులు

ఏడీఎంఈ ప్రిన్సిపాల్ జీఎంసీ డాక్టర్ విజయ్‌కుమార్



సభలో మాట్లాడుతున్న ఏడీఎంఈ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

ఏలూరు (టూటౌన్): ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 2022లో భారత దేశంలో 14.10 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదు కావడంతో పాటు క్యాన్సర్ వల్ల 9.10 లక్షల మంది మరణించారని, ప్రస్తుతం దేశంలో 38 లక్షల మంది క్యాన్సర్‌తో జీవిస్తున్నారని ఏడీఎంఈ ప్రిన్సిపాల్ జీఎంసీ డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2022లో 75,536 కొత్త క్యాన్సర్ కేసులు, 40,307 మరణాలు నమోదయ్యాయన్నారు. దేశంలో 75 ఏళ్ల లోపు వారికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం 10.6 శాతం, అదే వయస్సులో మరణించే ప్రమాదం 7.2 శాతం ఉందని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ ప్రమాదాలు 20 శాతం, 9.6 శాతంగా ఉన్నట్టు చెప్పారు. రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ కేసులు దేశంలో 34 శాతం ఉన్నాయన్నారు. వీటిని ముందుగా గుర్తించడం ద్వారా క్యాన్సర్ మనుగడ రేటును గణనీయంగా తగ్గించవచ్చన్నారు. క్యాన్సర్ కేసులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ల మార్గదర్శకంలో ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికల అమలు చేయడానికి నిర్ణయం తీసుకుందని చెప్పారు. రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్లను గుర్తించేందుకు 30 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులందరినీ పరీక్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కెపాసిటీ బిల్డింగ్‌లో భాగంగా విశాఖ పట్టణంలోని హోమీ బాబా క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అన్ని వైద్య కళాశాలల్లోని ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్లలోని నిపుణుల కోసం మొదటి స్థాయి సెన్సిటైజేషన్ శిక్షణ పూర్తయిందని తెలిపారు. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ స్పెషలిస్ట్‌లకు రెండో స్థాయి శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. మూడో స్థాయి శిక్షణలో పీహెచ్‌సీ మెడికల్ అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలకు శిక్షణ ఉటుందన్నారు. హైపర్ టెన్షన్, మధుమేహం కోసం ఎన్‌సీడీ స్క్రీనింగ్ 3.0తో పాటు జూలై 2024లో స్క్రీనింగ్ ప్రారంభం కానుండగా జూన్ 15 నాటికి అన్ని శిక్షణా సెషన్‌లు పూర్తవుతాయని వెల్లడించారు.

రోగ నిర్ధారణకు రిపోర్టులు

స్క్రీనింగ్ సమయంలో కనుగొన్న క్యాన్సర్ కేసులు రోగ నిర్ధారణ, నిర్వహణ కోసం మెడికల్ కాలేజీలకు పంపుతారని డాక్టర్ విజయ్ కుమార్ చెప్పారు. ఈ కేసులను ఆరోగ్య వ్యవస్థ నిశితంగా పరిశీలిస్తుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారంగా సరైన రిఫరల్ సిస్టమ్‌ను నిర్ధారిస్తూ డేటాను పర్యవేక్షించేందుకు, నిర్వహించడానికి ఏపీ ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ స్పెషలిస్టు డాక్టర్ల సహాయంతో సాంకేతిక మార్గదర్శకాలను అందిస్తుందని తెలిపారు. కొనసాగుతున్న ప్రోగ్రాం నాణ్యతా తనిఖీకి నిర్వహిస్తారని చెప్పారు.

రెండు స్థాయిల్లో శిక్షణ

ఏలూరు జిల్లాకు మే 28 నుంచి మే 30 వరకు ఫేజ్ వన్, పశ్చిమగోదావరి జిల్లాకు జూన్ 5 నుంచి జూన్ 7 వరకు ఫేజ్ 2 రెండు దశల్లో రెండో స్థాయి శిక్షణ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాల, ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య అధికారుల సమన్వయంతో టీవోటీ శిక్షకుల బృందం, జీఎంసీ, ఏలూరు ద్వారా జిల్లా స్థాయిలో దంత వైద్యులు, గైనకాలజిస్టులు, వైద్య అధికారులకు సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు గంగాభవాని, ఉషాకిరణ్, అనూషా, నశ్రీన్, లక్ష్మీ సరస్వతి, కీర్తి ప్రియాంక, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.